క్లుప్తంగా

చెన్నై సినీ కార్మిక సంఘానికి ఆర్కే రోజా విరాళం



మేడే వేడుకల్లో మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : మే డే పురస్కరించుకుని చెన్నై సినీ కార్మిక సంఘానికి మాజీ మంత్రి ఆర్కే రోజా రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. గురువారం ఫెఫ్సీ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి ఆధ్వర్యంలో చెన్నైలో నిర్వహించిన ×దక్షిణ భారత సినీకార్మికుల సమ్మేళనంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తానీ రోజు ఈ స్థాయికి ఎదిగానంటే దానికి కారణం సినీ కార్మికులు, ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లే అన్నారు. వారికి ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. సినీ పరిశ్రమకు వచ్చిన కొత్తలో మేకప్ మెన్లు, కాస్ట్యూమ్ డిజైనర్లు, కో–డైరెక్టర్లు, చిన్న చిన్న కార్మికులు సైతం తనకెంతో సహకరించి తన ఎదుగుదలకు, ధైర్యంగా సినీరంగంలో కొనసాగడానికి సహకరించారన్నారు. వారి వలనే సినీ రంగంలో సక్సెస్ అయి తర్వాత రాజకీయ రంగంలో కూడా నిలదొక్కుకోగలిగానన్నారు. కార్మికులందరూ ఎప్పుడూ సంతోషంగా ఉండాలని కాంక్షిస్తూ విరాళమిస్తున్నానని చెబుతూ వారికి మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సినీ రంగానికి సేవలందించి పలువురు కార్మికులు, ప్రముఖులను ఆమె సన్మానించారు.

రాజేంద్రాచారి సేవలు శ్లాఘనీయం



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ నాయకులు మురళి

పుత్తూరు: స్థానిక శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ మాజీ అధ్యక్షుడు రాజేంద్రాచారి సేవలు శ్లాఘనీయమని వక్తలు ప్రస్తుతించారు. రాజేంద్రాచారి ఇటీవల హఠాన్మరణం చెందారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వ బ్రాహ్మణ సంఘ నాయకులు వీకే మురళి మాట్లాడుతూ, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునఃనిర్మాణం, కుంభాభిషేక కార్యక్రమాల నిర్వహణలో రాజేంద్రాచారి చేసిన కృషిని తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ స్థలదాత కె.కరుణాకరశెట్టి, పట్టణ ప్రముఖులు జీవరత్నం నాయుడు, వెంకటరత్నం, వసంతమ్మ, మాధవాచారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● నగరిలోని అరవకాపు వీధికి చెందిన దేవా డబ్బులు డ్రా చేయడానికి ఇండియన్ బ్యాంకు వద్దకు వెళ్లాడు. అయితే కొత్త ఏటీఎం కార్డు కావడంతో పిన్ నంబరు ఎలా జనరేట్ చేయాలో తెలియక పక్కనున్న వ్యక్తిని సాయం కోరాడు. ఆ వ్యక్తి దేవా చూస్తుండగానే ఏటీఎం పిన్ నంబర్ జనరేట్ చేసాడు. డబ్బులు డ్రా చేసేటప్పుడు ఉద్దేశపూర్వకంగా తప్పుడు నంబర్ కొట్టాడు. కాసేపు ప్రయత్నించినట్టు నటించి, డబ్బులు రాలేదంటూ కార్డు తిరిగిచ్చాడు. అలా తిరిగిచ్చే సమయంలో చాకచక్యంగా కార్డు మార్చేశాడు. ఆ తర్వాత కొంత సమయానికి ఆ కార్డుతో పిచ్చాటూరు ఏటీఎంలో రూ.30 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో మోసపోయిన విషయాన్ని తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● నగరిలోని కోళ్లవీధికి చెందిన కృష్ణయ్య సైతం ఇదే తరహాలో కెనరా బ్యాంకు ఏటీఎం వద్దకు వెళ్లాడు. డబ్బులు డ్రా చేయడం తెలియక పక్కనున్న వ్యక్తిని సాయం కోరాడు. సాయం చేస్తున్నట్లు నటించిన ఆ వ్యక్తి.. కస్టమర్ కళ్లముందే ఏటీఎంలో కార్డువేసి నంబరు ఎంట్రీ చేసి డబ్బులు డ్రా చేశాడు. డబ్బులు వస్తుంది తీసుకో అని చెప్పడంతో కృష్ణయ్య డబ్బులు తీసుకుంటూ ఆవైపు తిరిగాడు. ఆ సమయంలో చాకచక్యంగా కార్డుమార్చేసిన ఆ వ్యక్తి మరో కార్డును కృష్ణయ్యకు ఇచ్చేశాడు. ఆ తర్వాత కొంత సేపటికి ఆ కార్డుతో ఏకాంబరకుప్పం ఏటీఎంలో రూ.13 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● నాగరాజకుప్పం చెందిన ఏలుమలై రెడ్డి కూడా ఇలాగే ఇండియన్ బ్యాంకు ఏటీఎం వద్ద అపరిచిత వ్యక్తికి కార్డు ఇవ్వగా కార్డు మార్చేసి తీసుకెళ్లిన ఆ వ్యక్తి విడతల వారిగా కొంత సేపటికే రూ.50 వేలు డ్రాచేసేశాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే తరహాలో మోసపోయిన బాధితులు మరికొందరు ఉన్నప్పటికీ పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదని తెలియవచ్చింది.

ఏటీఎం కేటుగాళ్లు..!

- అమాయకులను బురిడీ కొట్టించి డబ్బు కాజేస్తున్న వైనం
- కార్డులు మార్చేసి నగదు ఉపసంహరణ
- లబోదిబోమంటున్న బాధితులు

నగరి: ఏటీఎంల వద్ద డబ్బులు డ్రా చేయడానికి వచ్చిన వ్యక్తులను బురిడీ కొట్టించి డబ్బులు కాజేసే కేటుగాళ్ల వ్యవహారం నగరిలో వెలుగులోకి వచ్చాయి. స్థానిక ఇండియన్ బ్యాంకు ఏటీఎం, కెనరా బ్యాంక్ ఏటీఎం వద్దకు డబ్బులు డ్రా చేయడానికి వచ్చే వారిలో అమాయకులు, డబ్బులు డ్రా ఎలా చేయాలో తెలియని వారిని ఇట్టే పసికట్టి వారిని టార్గెట్ చేస్తున్నారు. డబ్బులు డ్రా చేయడానికి సాయం చేస్తున్నట్టు నటించి, కార్డులు మార్చి, నగదు కొట్టేస్తున్నారు.

చాకచక్యంగా కార్డుల మార్పు

ఏటీఎం మోసగాళ్లు కార్డుల మార్పు విషయంలో చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. కెనరా బ్యాంకు ఏటీఎం కార్డు ఇచ్చే వారికి మార్చి ఇచ్చే సమయంలోను అదే బ్యాంకుకు సంబంధించి అదే రంగుతో ఉన్న కార్డును ఇస్తున్నారు. కార్డు కొత్తగా ఉంటే అలాంటి కార్డునే తిరిగి ఇస్తున్నారు. ఈ కార్డులన్నీ మరోచోట కొట్టుకొచ్చిన కార్డులే కావడం విశేషం! ఇక్కడ బెంగళూరుకు చెందిన ఏటీఎంలలో ఇలాగే మోసం చేసి కార్డులు కొట్టేసినట్లు తెలుస్తోంది. అక్కడ కొట్టేసిన కార్డులు ఇక్కడ ఇస్తున్నట్టు బోధపడుతోంది. అంటే మోసగాళ్లు పలుచోట్ల ఇలా డబ్బులు కొట్టేసినట్టు స్పష్టమతోంది. ఏటీఎంలలో నగదు డ్రా చేసేటప్పుడు కెమెరాలో ఈ కేటుగాళ్లు, బాధితుల చిత్రాలు రికార్డు అవుతున్నాయి. వీటి ఆధారంగా కేటుగాళ్ల భరతం పట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



కృష్ణయ్య కార్డు ఏటీఎంలో పెడుతున్న మోసగాడు, డబ్బులు తీసుకుంటుండగా కార్డు మార్చేస్తున్న దృశ్యం, మార్చిన కార్డును కృష్ణయ్యకు ఇస్తున్న కేటుగాడు, కృష్ణయ్యకు మోసగాడు మార్చి ఇచ్చిన ఏటీఎం కార్డు



ఏటీఎంకు పిన్ సెట్ చేసేందుకు దేవా ఏటీఎం కార్డు ఇచ్చిన వ్యక్తి

వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుల నియామకం

కార్వేటినగరం : వైఎస్సార్‌సీపీ గంగాధర నెల్లూరు పార్టీ మండల కమిటీ ఉపాధ్యక్షులుగా ఏకాంబరం, ఢిల్లీ కుమారులను పార్టీ కేంద్ర కమిటీ నియమించినట్లు గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా ప్రధాన కార్యదర్శులుగా జగదీష్ బాబు , హరీష్ రెడ్డి, రాజేంద్ర రెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి, పట్టాభిరెడ్డి, కృష్ణారెడ్డి, కార్యదర్శులుగా లారెన్స్, మణి, ప్రభాకర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, వరదరాజుల రెడ్డి, విజయ శేఖర్, సదాశివరెడ్డి, చిన్నబ్బా (వేల్కూరు కుట్టి) , వెంకటేష్ రెడ్డిని నియమించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా పార్టీ మండల సంయుక్త కార్యదర్శులను మరికొంత మందిని నియమించినట్లు తెలిపారు.

రైతులకు నైపుణ్య శిక్షణ

కార్వేటినగరం : రైతులకు నైపుణ్య శిక్షణ ఎంతో అవసరమని మండల వ్యవసాయాధికారిణి హేమలత పేర్కొన్నారు. గురువారం వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఓ మాట్లాడుతూ.. నేటి నుంచి మండలంలోని ఒక్కో రైతు సేవా కేంద్రాల పరిధిలో 30 మంది రైతులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. స్మార్ట్ ఫోన్‌లో వ్యవసాయ సంబంధిత యాప్‌లు, యూట్యూబ్‌లో వ్యవసాయ ఛానళ్లు, ఫోన్ పే లావాదేవీలు, వ్యవసాయ మార్కెట్ ధరలు తదితర అన్ని విషయాలు రైతులే స్వయంగా స్మార్ట్ ఫోన్ ద్వారా తెలుసుకునేలా శిక్షణ ఉంటుందన్నారు.

వైభవంగా ద్రౌపది కల్యాణోత్సవం

పాలసముద్రం : మండలంలోని ఆముదాలలోని ధర్మరాజుస్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలలో భాగంగా అయిదో రోజు గురువారం ద్రౌపది సమేత ధర్మరాజుస్వామికి అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. భక్తులు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం పూర్ణ భాగతారిణి హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు



హాజరైన భక్తులు

భక్తిప్రపత్తులతో కలశపూజ

బంగారుపాళెం : మండలంలోనిమొగిలి శివాలయ అనుబంధ ఆలయమైన దేవర కొండపై గురువారం కలశపూజ కార్యక్రమం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. పార్వతీ సమేత శ్రీజలకంఠేశ్వరస్వామి దేవస్థానం జీర్ణోద్ధరణ, నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా అర్చకులు ఉదయం గణపతిపూజ, స్వస్తివాచనం, రక్షాబంధన, కలశారాధన, అభిషేకం, శాంతి, సర్వదేవతా, రుద్రహోమాలు, సాయంత్రం గోపూజ, అంకురార్పణ ఇత్యాది వాటిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎంపీపీ సుచిత్ర, జయ ప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్..

గుడిపాల: మండల కేంద్రానికి పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ గణపతి గురువారం తెలిపారు. తొలి విడతగా 8,614 పాఠ్యపుస్తకాలు వచ్చాయని, వీటిని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో భద్రపరచినట్లు తెలిపారు. ఇంకనూ మరికొన్ని పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందన్నారు.

● ఆశీస్సులు

వెదురుకుప్పం : మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయ ఆవరణలో జరిగిన వివాహ వేడుకలను గురువారం ఉదయం మాజీ ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరాజారెడ్డి, రాజేంద్రరెడ్డి, కోలార్ ప్రకాష్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.




చంద్రప్రభ వాహనంపై శివపార్వతులు

- ధ్వజారోహణంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

పుత్తూరు: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజారోహణంతో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 7–30 నుంచి 8 వరకు ధ్వజారోహణ ఘట్టాన్ని వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాలు, భక్తుల శివనామస్మరణల నడుమ ఆలయ ప్రధాన అర్చకులు మురళీధర్ గురుకుల్ బృందం వైభవంగా నిర్వహించారు. 18 గణాలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడమే ధ్వజారోహణ ఘట్టం ఆంతర్యమని అర్చకులు చెప్పారు. అంతకు ముందు తెల్లవారుజామున స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు

సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి చంద్రప్రభ వాహనంపై కొలువు దీర్చారు. రాత్రి 8 గంటలకు మంగళవాయిద్యాలు, విద్యుత్ దీపకాంతులతో చంద్రప్రభ వాహనంపై పట్టణ పురవీధుల్లో శివపార్వతులు ఊరేగారు. భక్తులు ఇంటింటా టెంకాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయానికి భూరి విరాళ దాత దివంగత కోలా పెద్దమునెమ్మ కుటుంబ సభ్యులు ధ్వజారోహణానికి, చంద్రప్రభ వాహనానికి ఎస్.సుబ్రమణ్యాచారి, విశ్వబ్రాహ్మణ సేవా సమితి సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.



చంద్రప్రభ వాహనంపై శివపార్వతులు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

ట్రాఫిక్ జామ్.. జామ్

- రోడ్లపైనే ఇష్టానుసారంగా పార్కింగ్
- కార్వేటినగరంలో అవస్థలు పడుతున్న ప్రజలు

కార్వేటినగరం : కొన్నేళ్లుగా పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారు. నిత్యం బెంగళూరు నుంచి శ్రీహరికోటకు కంటైనర్లతో పాటు, పెద్ద వాహనాలు నగరం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. పెద్ద వాహనాలు ఎదురైనప్పుడు ట్రాఫిక్ అంతరాయంతో ఇబ్బందులు పడుతున్నారు. వారం కిందట పోలీస్ ఉన్నతాధికారులు దుకాణాదారులతో సమావేశం ఏర్పాటు చేసి దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన ఆక్రమణలను స్వయంగా తొలగించుకోవాలని లేని పక్షంలో జరిమానా విధిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో బుధవారం గాండ్లమిట్ట కూడలీ వద్ద రెండు కంటైనర్లు ఎదురెదురుగా రావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దీనికి తోడు బైపాస్ రోడ్డు లేకపోవడంతో పాటు, బజారు వీధి, మండపం వీధుల్లో ఎక్కువగా ఆక్రమణలు ఉండటంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. అలాగే చిత్తూరు నుంచి రేణిగుంట విమానాశ్రయానికి ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉండడంతో కార్వేటినగరంలో ట్రాఫిక్ అంతరాయం మరింత జఠిలంగా మారింది. అదే విధంగా ఆటోలు, దుకాణాలకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపై నిర్లక్ష్యంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

వారపు సంతతో మరింత జఠిలం

ప్రతి గురువారం జరిగే వారపు సంతకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ద్విచక్ర వాహనాల్లో అధిక సంఖ్యలో తరలిరావడం, దీనికి తోడు పచ్చికాపల్ల మార్గంలో ఎక్కువగా టిప్పర్లు రాకపోకలు సాగించడంతో గురువారం ట్రాఫిక్ మరింత జఠిలంగా మారుతోంది. గురువారం రాత్రి ఎరువుల లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్, ఎదురుగా టిప్పర్ రావడంతో ట్రాఫిక్ అంతరాయంతో జనం ఇబ్బందులు పడ్డారు.



పచ్చికాపల్లం మార్గంలో టిప్పర్, ట్రాక్టర్ ఇరుక్కుపోయిన వైనం



గాండ్లమిట్ట కూడలి వద్ద కంటైనర్లు ఎదురుపడి ట్రాఫిక్ అంతరాయం

మేడే స్ఫూర్తితో పోరాడుదాం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సీపీఐ మండిపాటు
- మోదీ విధానాలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న చంద్రబాబు





నగరి : ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ కార్మిక సంఘం, గంగాధర నెల్లూరు: జైన్ కర్మాగారం వద్ద జెండా ఎగురవేస్తున్న సుబ్రహ్మణ్యంరెడ్డి

నగరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా గురువారం మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో జెండా ఎగురవేశారు. రామానాయుడు మాట్లాడుతూ, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. అలాగే, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోదీ విధానాలను చంకనెత్తుకుని ఇటు ఉద్యోగులను అటు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ విధానానికి స్వస్తి పలికి పర్మినెంట్ చేస్తామన్న హామీ ఇచ్చిన ఆయన అందరినీ వంచించారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోవిందస్వామి, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి చందామర్రై, పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్, గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజేంద్రన్, ఏఐటీయూసీ పట్టణ నాయకులు, ఆటో యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు, మున్సిపల్ వర్కర్లు, ఏరియా హాస్పిటల్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాల్లో వెలుగుల రోజు మేడే

పుత్తూరు: కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన రోజు మేడే అని సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి నగరం రోడ్డు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. కార్మికులకు సరైన జీతాలు ఇవ్వని కార్పొరేట్ కంపెనీలకు ప్రస్తుత ప్రభుత్వాలు దాసోహం అంటున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం నాయకులు వెంకటరత్నం, సుబ్రమణ్యంరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు లక్ష్మీపతి, శివ, శీను, చంద్రారెడ్డి, గురవయ్య, సమాచార హక్కుల నాయకులు బాబు, లీలావతి, హేమలత, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద సీఐటీయూ జెండాను ఎగురవేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆటో కార్మికులతో కలిసి స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం : పట్టణంలో మే దినోత్సవాన్ని గురువారం వామపక్ష నాయకులు , వివిధ సంఘాల కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లు ఘనంగా జరుపుకున్నారు. సీఐటీయూ, ఏఐటీయూ సంఘం నాయకులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం మండలంలో వామపక్ష నాయకులు , వివిధ సంఘాల కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లు జెండా ఆవిష్కరించి ఘనంగా జరుపుకున్నారు.

గంగాధర నెల్లూరు : మండలంలోని జైన్ కర్మాగారంలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు కలిజవేడు సుబ్రమణ్యంరెడ్డి జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, అశోక్ , సురేష్ , సుబ్రహ్మణ్యం, భూపతి , కార్మికులు పాల్గొన్నారు.







నగరిలో మేడే వేడుకలు నిర్వహిస్తున్న వీధి కూరగాయల విక్రయదారుల సంఘ నాయకులు, కార్వేటినగరం : గాండ్లమిట్ట కూడలిలో జెండా ఆవిష్కరణ, పుత్తూరులో ర్యాలీ ప్రారంభిస్తున్న మురగారెడ్డి

సియోన్‌మలై ఉత్సవాలకు ఏర్పాట్లు

గుడిపాల: ప్రతి ఏటా మేలో నిర్వహించే సియోన్ తిరుమలై ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యదర్శి కరుణాజాన్ గురువారం తెలిపారు. మండలంలోని గట్రాళ్లమిట్ట పంచాయతీలోని సియోన్‌మలైలో ఈ నెల 9 నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఈ ఉత్సవాలకు ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక నుంచి ఎక్కువ సంఖ్యలో క్రైస్తవ భక్తులు రావడం పరిపాటి. 9వ తేదీ వేలూరు డయాసిస్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు ప్రారంభిస్తారు. ఇదే రోజు సాయంత్రం క్రైస్తవ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. 10న పలువురు పాస్టర్ల వాక్య సందేశం ఉంటుంది. 11న సైతం వేడుకలు ఉంటాయి. వచ్చే క్రైస్తవులకు మూడు రోజుల పాటు ఇక్కడ అన్నదానం కూడా చేయనున్నట్టు నిర్వాహకులు చెప్పారు.